# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 228 | విశాఖపట్నం | 19-5-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 228 | VISAKHAPATNAM | 19-5-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay


Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram

## నిర్దేశిత గడువులోగా ఇరిగేషన్ ప్రాజెక్టులు

# పూర్తి కావాలి : చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇటీవల విడుదల చేసిన ఇరిగేషన్ క్యాలెండర్?కు అనుగుణంగా నిర్దేశిత గడువుకు ప్రాజెక్టులు పూర్తి కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వాటర్ మేనేజ్మెంట్‌లో సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లోనే సాగునీటి రంగంపై ఏకంగా రూ.23,793 కోట్లు ఖర్చు చేశారు. ఏపీలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ప్రాధాన్య క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులను మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో నిధుల కేటాయింపు, ఖర్చు, పర్యవేక్షణ, అవసరమైన సమస్యలను పరిష్కరించి నిర్దిష్ట గడువులోగా సంబంధిత పనులు పూర్తి చేసేవిధంగా ముందుకువెళ్తున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క జలవనరుల శాఖలోనే ఏకంగా రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగులో పెట్టి వెళ్లింది. ఓ వైపు ఈ బిల్లులు చెల్లిస్తూనే మరోవైపు అనేక సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతూ పనుల్లో వేగం సైతం పెంచారు. 2014-19 మధ్య రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు (తరువాయి 2వ పేజీలో)



## రహదారి నిర్మాణంలో..

# నాణ్యతా లోపాలు!

- ఇష్టారాజ్యంగా సాగుతున్న పనులు
- మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్న వైనం
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు
- కొరవడిన పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణ

**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల నిర్మాణంలో నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. దశాబ్ద కాలం పాటు చెక్కుచెదరకుండా ఉండాల్సిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. నిర్మించిన కొద్దిరోజులకే అధ్వానంగా మారడంతో గిరిజనులకు ఇక్కట్లు తప్పడం లేదు. మొత్తంగా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడం.. గిరిశిఖర గ్రామాల్లో అడిగే వారే లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారనే విమర్శలున్నాయి. గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని.. డోలీ మోతలు తప్పించాలనే (తరువాయి 2వ పేజీలో)



5లో

నీరున్నా.. బీడుగా మారుతున్న భూములు!

### లోకేష్‌పై తీవ్రస్థాయిలో మాజీ మంత్రి అంబటి విమర్శలు



2లో



6లో

లివర్ వ్యాధులు ఉంటే చర్మం ఈ లక్షణాలను తెలియజేస్తుంది..!

## జైళ్ల శాఖలో ప్రక్షాళన చేసి చూపిస్తాం: అనిత



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. (తరువాయి 2వ పేజీలో)

## కేజీహెచ్‌లో సీసీ హిమోగ్లోబినోపతీస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గిరిజనుల సంరక్షణ, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తాందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. సికిల్ సెల్ వ్యాధి బాధితులకు అండగా.. విశాఖ కేజీహెచ్ సెంటర్ ఆఫ్ కాంపిటెంట్ హిమోగ్లోబినోపతీస్ సెంటర్‌ను కూటమి నేతలతో కలిసి ఆమె ప్రారంభించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణ మిషన్ 2047లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.3.77 కోట్ల వ్యయంతో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు



భానుడి భగ భగలు

2లో

## గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేస్తాం: జనార్దన్ రెడ్డి



**అమరావతి, పతాకం న్యూస్:** గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హర్బర్‌ల నిర్మాణంలో ఏదైనా (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అనుభవం..

దేశ ప్రజలకు మరోసారి అదే అనుభవం ఎదురైంది. ముందుగా హామీ! తర్వాత హఠాత్తుగా భారమైన నిర్ణయం! "పెట్రోలు, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు" అని కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు పలుమార్లు చెప్పిన కొద్ది రోజులకే అర్ధరాత్రి నుంచి లీటర్‌కు మూడు రూపాయల వరకు ధరలు పెంచడం దేశవ్యాప్తంగా ఆగ్రహానికి దారితీసింది. ఇది కేవలం ధరల పెంపు మాత్రమే కాదు; ప్రభుత్వ విశ్వసనీయత, ఆర్థిక విధానం, ఎన్నికల రాజకీయాలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు అన్నీ కలిసిన ఒక పెద్ద కథ. నాలుగేళ్ల తర్వాత దేశవ్యాప్తంగా ఇంధన ధరల్లో ఇంత భారీ పెంపు జరగడం ఇదే మొదటిసారి. దేశంలోని అనేక నగరాల్లో పెట్రోలు ధర లీటర్‌కు వంద రూపాయల గీత దాటగా, డీజిల్ కూడా ఆ స్థాయికి చేరువవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతి రంగానికీ రక్తంలా పని చేసేది ఇంధనం. అలాంటి ఇంధన ధరలు పెరగడం అంటే చివరకు ప్రతి కుటుంబపు నెల బడ్జెట్ కుదేలవడమే. ఈ పెంపుపై ప్రజల్లో ఎక్కువ ఆగ్రహం రావడానికి ప్రధాన కారణం ధరల పెంపు కంటే ప్రభుత్వ వైఖరే. గత కొన్ని వారాలుగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ "భారత వినియోగదారులపై అదనపు భారం వేయం" అని కేంద్రం సంకేతాలు ఇచ్చింది. ప్రభుత్వ అనుకూల ఆర్థిక విశ్లేషకులు కూడా "ధరలు స్థిరంగానే ఉంటాయి" అని ప్రచారం చేశారు. కానీ ఒక్కసారిగా అర్ధరాత్రి నుంచి పెంపు అమలు చేయడంతో ప్రజల్లో మోసం చేసిన భావనను పెంచింది. ఇది కొత్త విషయం కాదు. గతంలో కూడా ఎన్నికల సమయంలో ధరలను కృత్రిమంగా నియంత్రించి, తర్వాత ఒక్కసారిగా పెంచిన ఉదాహరణలు ఉన్నాయి. 2024 సాధారణ ఎన్నికల ముందు కేంద్రం ఎక్సైజ్ సుంకాలను తగ్గించి ప్రజలకు ఉపశమనం ఇచ్చినట్లు ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అదే ప్రభుత్వం అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపిస్తూ ధరలను పెంచుతోంది. రాజకీయంగా చూస్తే ఇది "ఎన్నికల ఆర్థిక శాస్త్రం"గా విమర్శలు ఎదుర్కొంటోంది. ఎన్నికల ముందు ధరలు తగ్గించడం, ఎన్నికల తర్వాత వాస్తవ భారం మోపడం అనే విధానం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్ తీవ్రమైన ఉద్రిక్తతలో ఉంది. పశ్చిమ ఆసియాలో ఇరాన్, అమెరికా మద్దతు దేశాల మధ్య పెరుగుతున్న ఘర్షణలు ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం జరిగే హోర్ముజ్ జలసంధి ప్రాంతం యుద్ధ వాతావరణంలోకి వెళ్లడం మార్కెట్‌ను కుదిపేసింది. కొన్ని వారాల క్రితం బ్యారెల్ ముడి చమురు ధర 68 నుంచి 70 డాలర్ల మధ్య ఉండగా, ఇప్పుడది 110 డాలర్ల దాకా వెళ్లినట్లు అంతర్జాతీయ అంచనాలు చెబుతున్నాయి. అంటే కేవలం ఒక్క నెలలోనే దాదాపు 60 శాతం పెరుగుదల నమోదైంది. ప్రపంచంలో మూడో అతి పెద్ద చమురు దిగుమతి దేశమైన భారత్‌కు ఇది పెద్ద దెబ్బ. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అంటే ప్రపంచ మార్కెట్‌లో ఒక్క డాలర్ పెరిగినా భారత ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుంది. ఆ భారం చివరకు వినియోగదారుడి జేబు నుంచే వసూలవుతుంది. ఇక్కడ మరో కీలక అంశం రూపాయి బలహీనపడడం. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీ ఒత్తిడిలో ఉంది. డాలర్లలో చమురు కొనాల్సి ఉండటంతో రూపాయి పడిపోతే భారత్‌కు దిగుమతి వ్యయం మరింత పెరుగుతుంది. 2014లో ఒక డాలర్ విలువ సుమారు 60 రూపాయల వద్ద ఉండగా, ఇప్పుడు అది 96 రూపాయల దాకా చేరింది. అంటే గత దశాబ్దంలో రూపాయి విలువ దాదాపు 48 శాతం క్షీణించింది. ఇది చమురు ధరల పెరుగుదల ప్రభావాన్ని మరింత తీవ్రం చేస్తోంది. సాధారణంగా ప్రజలు పెట్రోలు ధర పెరిగిందంటే బైక్‌కు ఎక్కువ ఖర్చు అవుతుందని మాత్రమే భావిస్తారు. కానీ వాస్తవానికి ఇంధన ధరల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద ఉంటుంది. భారత్‌లో సరుకు రవాణాలో దాదాపు 70 శాతం రోడ్డు మార్గంపైనే ఆధారపడి ఉంటుంది. ట్రక్కులు, బస్సులు, వ్యవసాయ యంత్రాలు అన్నీ డీజిల్‌పైనే నడుస్తాయి. అందువల్ల డీజిల్ ధర పెరిగితే: ౹ి కూరగాయల ధరలు పెరుగుతాయి , ౹ి పాలు, ధాన్యం, నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చు పెరుగుతుంది, ౹ి బస్సు చార్జీలు పెరిగే అవకాశం ఉంటుంది, ౹ి రైతుల సాగు వ్యయం అధికమవుతుంది, ౹ి నిర్మాణ రంగం ఖర్చులు పెరుగుతాయి, ౹ి ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుంది. భారత రిజర్వ్ బ్యాంకు ఇప్పటికే ద్రవ్యోల్బణం 6 శాతానికి పైగా వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. ఇంధన ధరల పెంపుతో ఆహార ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉంది. "అంతర్జాతీయ మార్కెట్ కారణంగా నష్టాలు వస్తున్నాయ"ని ప్రభుత్వం, చమురు సంస్థలు అంటున్నాయి. కానీ విమర్శకులు మాత్రం మరో ప్రశ్న వేస్తున్నారు. గత రెండు సంవత్సరాల్లో అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం ప్రజలకు ఎందుకు ఇవ్వలేదు? 2020లో అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ చమురు ధర 20 డాలర్ల దిగువకు పడిపోయినా దేశంలో పెట్రోలు ధరలు తగ్గలేదు. అప్పట్లో కేంద్రం భారీగా ఎక్సైజ్ సుంకాలు పెంచి లక్షల కోట్ల ఆదాయం సంపాదించింది. కేంద్రానికి ఇంధన పన్నుల ద్వారా ప్రతి సంవత్సరం సుమారు నాలుగు నుంచి ఐదు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. అంటే ధరలు తగ్గినప్పుడు వచ్చే లాభం ప్రభుత్వానికి. పెరిగినప్పుడు వేసే భారం ప్రజలపైనా? ఇంధన ధరలు భారత రాజకీయాల్లో ఎప్పుడూ కీలక అంశమే. గతంలో పెట్రోలు ధరల పెంపుపై ఉద్యమాలు చేసిన రాజకీయ పార్టీలు ఇప్పుడు అధికారంలో ఉండి అదే నిర్ణయాలు తీసుకోవడం ప్రజల్లో నిరాశ కలిగిస్తోంది.

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 38కి పెంపు.. ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచుతూ ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఆర్డినెన్స్‌పై ఆమోదముద్ర వేయడంతో ఇది తక్షణమే అమల్లోకి వచ్చింది.సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టం, 1956'లోని సెక్షన్ 2ను సవరించారు. దీని ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా ఇతర న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37కు పెరిగింది. దీంతో సీజేఐతో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరగనందున, రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టరూపం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో ఏర్పడిన నాలుగు అదనపు న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం త్వరలో పేర్లను సిఫార్సు చేసే ప్రక్రియను ప్రారంభించనుంది.

## పోలీస్ వేషంలో డబుల్ మనీ మోసం.. ఐదుగురు కేటుగాళ్ల అరెస్టు



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** లక్ష ఇస్తే పది లక్షలు ఇస్తామని అమాయకులను మోసం చేస్తున్న ముఠాను సత్యసాయి జిల్లా లేపాక్షి పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ యూనిఫామ్ వేసుకుని నటిస్తూ 'సీక్రెట్ డీల్' పేరుతో డబుల్ మనీ స్కామ్‌కు పాల్పడుతున్న ఐదుగురు నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన టాయ్ కరెన్సీ, కౌంటింగ్ మెషీన్, కారు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితులు పోలీసుల వేషంలోనే మోసాలకు పాల్పడిన ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. లక్ష రూపాయలు ఇస్తే పది లక్షలు ఇస్తామంటూ అమాయకులను టార్గెట్ చేసిన మోసగాళ్ల ముఠాను లేపాక్షి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండూరు రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా భారీగా టాయ్ కరెన్సీ బయటపడింది. అయితే పక్కా సమాచారంతోనే తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు వివరించారు. 'సీక్రెట్ డీల్' పేరుతో వల: పోలీసుల విచారణలో నిందితులు పోలీస్ అధికారుల్లా నటిస్తూ 'సీక్రెట్ డీల్' పేరుతో డబుల్ మనీ స్కామ్‌కు పాల్పడుతున్నట్లు తేలింది. బాధితులకు ముందుగా అసలు నోట్లు చూపించి నమ్మకం కలిగించి, తర్వాత టాయ్ కరెన్సీ కట్టలు అందించి మోసం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కోట్ల రూపాయల మోసాలకు ఈ ముఠా ప్లాన్ చేసినట్లు గుర్తించారు. రూ.50 లక్షల టాయ్ కరెన్సీ స్వాధీనం: ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన టాయ్ కరెన్సీ, పోలీస్ యూనిఫామ్‌లు, కౌంటింగ్ మెషీన్, కారును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో చిలమత్తూరు, అనంతపురం, కర్ణాటకలోని బాగేపల్లి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 'సులభంగా డబ్బు వస్తుందని నమ్మి ఇలాంటి మోసాలకు గురికావొద్దు. డబుల్ మనీ పేరుతో వచ్చే ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశ చివరకు భారీ నష్టాలకు దారి తీస్తుంది' హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలియజేశారు.

## భానుడి భగ భగలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఎండ తీవ్రత, వడగాడ్పులకు జనం అల్లాడిపోతున్నారు. దీంతో మధ్యాహ్నం జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. దేవరాపల్లిలో 41.2, నర్సీపట్నం, మాకవరపాలెంలో 40.2, నాతవరంలో 39.5, చోడవరంలో 39.2, గొలుగొండ, రావికమతం, మాడుగులలో 38.9, బుచ్చెయ్యపేటలో 38.8, కె.కోటపాడు, సబ్బవరంలో 38.5, మునగపాకలో 38.4, చీడికాడలో 38.1, రోలుగుంటలో 37.9, కశింకోటలో 37.7, అనకాపల్లిలో 37.5, నక్కపల్లిలో 37, అచ్యుతాపురంలో 36.9, కోటవురట్లలో 36.8, ఎస్.రాయవరంలో 36.7, పాయకరావుపేటలో 36.5, రాంబిల్లిలో 36.3, ఎలమంచిలిలో 36.1, పరవాడలో 35.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## లోకేష్‌పై తీవ్రస్థాయిలో మాజీ మంత్రి అంబటి విమర్శలు



**గుంటూరు, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు.. ఏపీ మంత్రి నారా లోకేష్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకేష్ కు 'లవ్ క్యాష్' అనే కొత్త పేరు పెడుతున్నట్లు ప్రకటించి, ఆయన డబ్బును అమితంగా ప్రేమిస్తారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పెరిగిన ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. "ఆయన పేరు లోకేష్ కాదు, లవ్ క్యాష్. ఎందుకంటే ఆయన డబ్బును ప్రేమిస్తారు" అని అన్నారు. లోకేశ్ చిన్నప్పుడు అన్నప్రాశన సమయంలో బంగారం, పుస్తకాలు వంటివి కాకుండా డబ్బునే పట్టుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని లోకేష్ మేనమామ అయిన నందమూరి హరికృష్ణ తనకు స్వయంగా చెప్పారని అంబటి గుర్తుచేశారు. చిన్నప్పటి నుంచే లోకేష్ కు డబ్బుపై ప్రేమ ఎక్కువని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ఇంధన ధరలు దేశంలోనే అత్యధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని కోరుతూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా గుంటూరులో జరిగిన కార్యక్రమంలో అంబటి పాల్గొన్నారు. ప్రస్తుతం నారా లోకేష్ ను ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్



**కేరళ, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది.

(మొదటిపేజీ తరువాయి)

## పూర్తి కావాలి: చంద్రబాబు

స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఎందుకంటే ఆ ఐదు సంవత్సరాల్లోనే రూ.11 వేల కోట్ల వరకు నీరు ప్రగతి పనులకు, మరో రూ.50 వేల కోట్లకు పైగా జలవనరుల శాఖకు ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రస్తుతం మళ్లీ ఆ దిశగా పనులు ఊపందుకున్నాయి. హంద్రీ-నీవా కాలువ రాయలసీమలోని ఉమ్మడి జిల్లాల్లో పరుగులు తీస్తుంది. కృష్ణా రద జలాలను 738 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుంది. కేవలం 2,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగు పనులు సైతం చేసి దాని ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఈ పనుల కోసం రూ.3,500 కోట్లను ఖర్చు చేశారు. ఈ కాలువ ద్వారా రాయలసీమలోని జిల్లాలకు ఈ సంవత్సరం 43 టీఎంసీలకు పైగా జలాలను విడుదల చేశారు. అందుభాగంగా కుప్పానికి మొదటిసారి నీటిని అందించారు. అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలంటే ఇంకా నిర్మాణ పనులకోసం రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సిఉంది. అలాగే పునరావాసానికి దాదాపు రూ. వెయ్యి కోట్లు కావాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక టన్నెళ్ల తవ్వకాల్లోని పెండింగు పనులతో పాటు లైనింగు పనుల వేగాన్ని సైతం పెంచారు. హెడ్ రెగ్యులేటర్ పనులను చేస్తున్నారు. 18 నెలల్లో 3,708 మీటర్ల మేర టన్నెల్ లైనింగు పూర్తయింది. ఫీడర్ కాలువ మరమ్మతులు లైనింగు కోసం ఏకంగా రూ.456 కోట్లు విడుదల చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో వెలిగొండపై ఇప్పటివరకు రూ.571 కోట్లను ఖర్చు చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు సైతం వేగవంతమయ్యాయి.

## గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలి: జనార్దన్ రెడ్డి

సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని అన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూములు సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేయొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

## జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతాం: అనిత

ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# వేగవంతంగా పాలగెడ్డ-ఆర్వీనగర్ రోడ్డు పనులు..



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** అంతర్ రాష్ట్ర పాలగెడ్డ-ఆర్వీనగర్ రహదారి నిర్మాణాలు ఊపందు కున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాలగెడ్డ-ఆర్వీనగర్ రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. దీంతో ఈ మార్గంపై ప్రయాణించే ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులు సర్కస్ ఫీట్లు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి పాలగెడ్డ-ఆర్వీనగర్ రహదారి 43.6 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.18.65 కోట్లను విడుదల చేశారు. ఈ రహదారి నిర్మాణాలను ఫిబ్రవరిలో ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. వర్షాల కారణంగా తొలుత పనుల్లో కొంత జాప్యం జరిగినా ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి.

## ప్రజలు పై బాదుడే బాదుడు మొదలుపెట్టిన చంద్రబాబు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

**మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్**



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ శాసనసభలుపశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ళ విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ పరిశీలకులు జహీర్ అహ్మద్ మాజీ కార్పొరేటర్లు వార్డ్ అధ్యక్షులు సీనియర్ నాయకులను కలుపుకొని గాజువాక డిపో వద్ద నుంచి నిరసన ర్యాలీగా ములగాడ ఎమ్మార్వో కార్యాలయం వరకు వెళ్లి అక్కడ డిప్యూటీ తాసిల్దార్ డి. రమాకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. విలేకరులతో సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ రేట్లు విపరీతంగా ఉన్నాయని మేము అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు పెట్రోల్ రేట్లు మరింత పెరిగిన ఎక్స్ఛేంజ్ సుంకం కూడా తగ్గించుకుంటా వాహనదారులపై తీవ్ర భారం వేసారని తెలిపారు. డీజిల్ రేట్లు పెరగడం వలన నిత్యవసర వస్తువులు రేట్లు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతుందని మళ్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం వెంటనే ఎక్సేంజ్ సుంకం తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో మోదకొండమ్మ ఉత్సవాలు



**పాడేరు, పతాకం న్యూస్:** అందరి సహకారంతో మోదకొండమ్మ ఉత్సవాలు (గిరిజన ఉత్సవం) విజయవంతమవుతున్నాయని జిల్లా కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గిరిజన ఉత్సవం పేరిట స్థానిక కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ధంకా వాయించి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొన్ని రోజులుగా కృషి చేస్తున్నారన్నారు. ఉత్సవాలకు విచ్చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రభుత్వ పరంగా ఉత్సవాల నిర్వహణకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి సహకరించారని కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత చైర్మన్ వంపూరు గంగులయ్య, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, తదితరులు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి గిరిజన కళాకారులు, విద్యార్థులు వేదికపై తమ ప్రదర్శనలిచ్చారు. ఈకార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట?ట్రటర్ వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఏవో ఎం.హేమలత, టీడబ్ల్యూ డీడీ పీబీకే.పరిమిళ, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు, సమగ్ర శిక్షణ ఏపీసీ స్వామినాయుడు, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు నిర్వహిస్తాం: పల్లా

**గాజువాక, పతాకం న్యూస్:** మహానాడు రద్దుపై తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో ఇంధన వనరులు ఆదా చేసుకునే నేపథ్యంలో భాగంగా నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. విశాఖపట్నంలో పల్లా శ్రీనివాసరావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఆలోచనతో, సీఎం చంద్రబాబు ఏకీభవిస్తూ మహానాడును రద్దు చేశారని వెల్లడించారు. కోవిడ్ లాంటి సమయంలో వర్చువల్ మహానాడును ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఇప్పుడు మహానాడు కార్యక్రమానికి రూ.5 నుంచి రూ.10 కోట్లు ఖర్చుతో కూడుకున్న విషయమని, అలాగే దాదాపుగా పదివేల వాహనాలు మహానాడుకు చేరుకుంటాయని చెప్పుకొచ్చారు. ఇంధన వనరులు ఆదా చేసుకోవడం కోసం ప్రతి నియోజకవర్గంలో హైబ్రిడ్ మోడల్ మహానాడు నిర్వహిస్తామని వివరించారు.

## ఎంపీ, ఎమ్మెల్యేలు బిఎన్ రోడ్డుపై ఇచ్చిన హామీ అమలు చేయాలి




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గం బిఎన్ రోడ్ కి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే. చోడవరం నియోజకవర్గంలో రూపురేఖలు మార్చేసి చేసి చూపిస్తాము అని ఎంపీ, ఏమ్మెల్యే హామీ ఇచ్చారు. నేటికీ రెండు సంవత్సరాలు అవుతుంది. గర్నికం నుండి మేడివాడ వరకు దుమ్ము ధూళితో. చుట్టుపక్కలు ప్రజలు మరియు ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. దొండపూడి వద్ద . బ్రిటిష్ వాళ్ళు నిర్మాణం చేసిన రోడ్డు. నేడు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాము. కూటమి నాయకులు ప్రకటన తప్ప ఆచరణలో నోచుకోవడం లేదు. తక్షణమే బిఎన్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించకపోతే సిపిఎం పార్టీ భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తాం. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు డిమాండ్ చేసారు.

## త్వరలో నర్సీపట్నంలో తృప్తి క్యాంటీన్ ప్రారంభం




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** మహిళలు వ్యాపారవేత్తగా ఎదగడంతో పాటు మరికొంత మందికి జీవనోపాధి కల్పించాన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తృప్తి క్యాంటీన్లు మంజూరు చేస్తోంది. జిల్లాలో తొలిసారి నర్సీపట్నానికి చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు మీర్ రహినా భానుకి యూనిట్ మంజూరు అయింది. మెప్మా అధికారులు ఆమెకు రూ.13.75 లక్షలు బ్యాంక్ రుణం ఇప్పించారు. సారా సంస్థతో కుదిరిన ఒప్పందం మేరకు ముందే నిర్దేశించిన డిజైన్‌తో కంటైనరు, వంటశాల సామగ్రి సమకూర్చారు. ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కంటైనర్ ఏర్పాటు చేసి పైన రేకుల షెడ్డు వేశారు. ఎవరికి వారు తమకు నచ్చిన పదార్థాలను ఎంత కావాలంటే అంత వడ్డించుకుని సంతృప్తిగా తినే క్యాంటీన్ త్వరలో నర్సీపట్నంలో ప్రారంభం కాబోతోంది. కస్టమర్ అరటి ఆకు వేసిన ప్లేటు పట్టుకొని వెళ్లి అక్కడ వరుసగా హాట్ డిష్‌ల్లో ఉంచిన వైట్ రైస్ , కూరలు, సాంబారు, ఫ్రై, పెరుగు కావల్సినంత స్వయంగా వడ్డించుకొని తినొచ్చు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మునిసిపాలిటీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా తృప్తి క్యాంటీన్‌లో తొలిసారి అధునాత బఫే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. తృప్తి క్యాంటీన్‌లో బేకరీ ఐటెమ్స్, స్వీట్స్, బర్గర్లు, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, ప్రత్యేకంగా వెజ్, నాన్ విజిటేరియన్ పలావ్ అందుబాటులో ఉంటాయి. మిగిలిన హోటళ్ల కంటే తక్కువ ధరకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందుబాటులోకి తెస్తున్నారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే క్యాంటీన్ ప్లాస్టిక్ రహితంగా నిర్వహించడానికి ఏర్పాటు చేశారు. చాలా హోటళ్లలో వేడి వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ పేపరు వేసి ప్లేట్లలో వడ్డిస్తారు. ఇక్కడ ప్లేటులో అరిటి ఆకు వాడతారు. టీ, కాఫీకి స్టీల్ గ్లాసులు, స్టీల్ ప్లేట్లు ఉపయోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. త్వరలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆస్తి కోసం వృద్ధ దంపతులపై కొడుకు, మనవళ్ల దారుణం

**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** మొగల్తూరు మండలం కొత్తాటలో దారుణం జరిగింది. ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులను కొడుకు, మనవళ్లు కలిసి తీవ్రంగా కొట్టారు. వృద్ధులను హింసిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. గ్రామానికి చెందిన కొప్పనాతి సూర్యనారాయణ, కస్తూరి దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొద్దిరోజులుగా ఆస్తి కోసం కొడుకు ముత్యాలరాజు, మనవళ్లు కలిసి సూర్యనారాయణ దంపతులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఆఖరికి కన్న తల్లిదండ్రులని చూడకుండా ముత్యాలరాజు.. వారిపై దాడికి తెగబడ్డాడు. ముత్యాలరాజుతో పాటు అతడి ఇద్దరు కొడుకులు రాధాకృష్ణ, శేఖర్ కూడా వృద్ధులనే కనికరం లేకుండా కాళ్లతో తన్నుతూ విచక్షణారహితంగా దాడి చేశారు.

## పూర్తయిన జీవీఎంసీ వార్డుల పునర్విభజన




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ పరిధిలో వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచుతూ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. ముసాయిదా ప్రతులను చీఫ్ సిటీప్లానర్ ఎ.ప్రభాకరరావు కమిషనర్ కేతన్‌గార్గ్‌కు అందజేశారు. ఆయన పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఆ మేరకు మార్పులు చేసి, 120 వార్డుల సరిహద్దులతో కూడిన ముసాయిదాను అన్ని జోనల్, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. జీవీఎంసీ పరిధిలోని వార్డుల సంఖ్యను 2011 జనాభా లెక్కల ప్రకారం 120కి పెంచుతూ పునర్విభజన చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల ఒకటిన జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. ఆ లెక్కల ప్రకారం నగర జనాభా 19 లక్షలు కావడంతో ఒక్కో వార్డులో సగటున 15,840 మంది ఉండేలా పునర్విభజన చేపట్టారు. వార్డుల పునర్విభజనకు తొలుత ఏప్రిల్ తొమ్మిది వరకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆ తర్వాత రెండుసార్లు పొడిగించింది. మే 17 నాటికి వార్డుల పునర్విభజన ముసాయిదాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేయడంతో అధికారులు ఆ మేరకు ప్రక్రియను పూర్తిచేశారు. శనివారం ముసాయిదాను కమిషనర్ పరిశీలనకు పంపారు. ఆయన ఆమోదం అనంతరం ఆదివారం సాయంత్రం డ్రాఫ్ట్‌ను విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను ఈనెల 24 వరకు స్వీకరిస్తారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మార్పులు, చేర్పులు చేపట్టిన తర్వాత 25వ తేదీ నుంచి జూన్ ఐదో తేదీ మధ్య ఫైనల్ డ్రాఫ్ట్‌ను సీడీఎంఏకి పంపించాల్సి ఉంటుంది. ఆ డ్రాఫ్ట్‌ను సీడీఎంఏ పరిశీలించిన తర్వాత జూన్ 12 నుంచి 23 మధ్యలో వార్డుల విభజనకు సంబంధించి తుది నోటిఫికేషన్ జారీచేస్తారు.ఇదిలావుండగా జీవీఎంసీ పరిధిలోని వార్డుల సంఖ్యను 120 నుంచి 150కి ఎంచాలంటూ నగరానికి చెందిన ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వ పెద్దలు వారి విజ్ఞాపనను పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్‌కు సూచించినట్టు సమాచారం. అందువల్లనే వార్డుల పునర్విభజన ముసాయిదా ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల విషయంలో కమిషనర్ తర్జనభర్జన పడినట్టు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతానికి వార్డుల పునర్విభజన ముసాయిదాపై ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, తర్వాత మార్పులు, జీవీఎంసీ పరిధిలో కొత్తప్రాంతాల విలీనం వంటి అవకాశాలను కొట్టివేయలేమని అధికారులు చెబుతుండడం విశేషం.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** స్థానిక తాండవ వంతెన వద్ద తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పాయకరావుపేట సీఐ ఎస్.శంకరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణంలో కొండవారపేటకు చెందిన మోర్త ప్రేమ్‌కుమార్ (22) తన స్నేహితుడు పాయకరావుపేటలోని లింగాలతోటకాలనీకి చెందిన ఆళ్ళ విజయ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున రెండు గంటలకు తుని నుంచి పాయకరావుపేటలోని లింగాలతోటకాలనీకి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. తాండవ వంతెన వద్ద మెడిసి సాయికుమార్ అనే వ్యక్తి పాయకరావుపేట నుంచి తుని వైపునకు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళ్తూ వీరిని బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ప్రేమ్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందగా, అతడి స్నేహితుడు విజయ్‌తోపాటు సాయికుమార్‌కి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్ఐ పురుషోత్తం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతుడి బంధువులకు అప్పగించామని ఆయన చెప్పారు.

## 19న కమిషనర్‌తో చర్చలు ఫలవంతం కాకపోతే నిరవధిక సమ్మె : సిఐటియు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జివిఎంసి)లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లపై గతంలో కమిషనర్లు అంగీకరించిన ఒప్పందాలను నిర్దిష్ట గడువులోగా అమలు చేయకపోతే నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు హెచ్చరించారు. ఈనెల 19న కమిషనర్ తో చర్చలు ఉన్నాయని,చర్చలు ఫలవంతం కాకపోతే నిరవధిక సమ్మె తప్పదని స్పష్టం చేశారు.జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు,ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కొత్త కమిషనర్ కేతన్ గార్డ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించామన్నారు.అయితే ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని వారు విమర్శించారు.గత వైసిపి,టిడిపి పాలకవర్గాలు కూడా కార్మికులను మోసం చేశాయని ఆరోపించారు. కౌన్సిల్‌లో ఆమోదించిన నీటి సరఫరా,వెటర్నరీ, పార్కులు,రిటైర్డ్ కార్మికులు, కారుణ్య నియామకాలు, లోడర్ల వేతనాల పెంపు వంటి అంశాలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్, అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌తో 2025 మే 2 న జరిగిన ఒప్పందాన్ని కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు.

## రైల్వే జోన్‌కు ఉద్యోగుల రాకలో జాప్యం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు అవసరమైన సిబ్బందిని పంపడంలో ఇతర జోన్ల అధికారులు తాత్సారం చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్త జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. అయితే ఆయన చేసిన ప్రకటనకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు. దీంతో రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ తీవ్రంగా స్పందిస్తూ అన్ని రైల్వే జోన్ల జనరల్ మేనేజర్లకు ఘాటుగా లేఖ రాశారు. విశాఖపట్నం జోన్‌తో పాటు కొత్తగా ఏర్పాటుచేసిన రాయగడ డివిజన్‌లో పనిచేస్తామని వివిధ జోన్ల నుంచి పలువురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ ఎన్‌ఓసీలు ఇప్పటికే ఇచ్చామని, అయితే వారిని రిలీవ్ చేయకుండా జాప్యం చేయడమేమిటని ఆయన లేఖలో అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇచ్చిన ఎన్‌ఓసీలకు, రిలీవ్ చేసిన ఉద్యోగుల సంఖ్యకు అసలు పొంతన లేదని, ఇలాగైతే కొత్త జోన్ ఆపరేషన్ ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఎన్‌ఓసీలు సమర్పించిన ఉద్యోగులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా జోన్‌కు 526 మంది, రాయగడ డివిజన్‌కు 191 మంది వెళ్లడానికి అప్రూవల్ పొందగా, వారిలో దక్షిణ కోస్తా జోన్‌కు రావడానికి 329 మందికి ఎన్‌ఓసీలు ఇచ్చారు. వారిలో ఈ నెల 11వ తేదీ నాటికి జోన్ కోసం 183 మందిని, డివిజన్ కోసం 47 మందిని మాత్రమే అక్కడి అధికారులు రిలీవ్ చేశారు. ఈ ప్రక్రియ ఇంత నెమ్మదిగా సాగితే ఇంకో పదిహేను రోజుల్లో కొత్త జోన్, డివిజన్ ఆపరేషన్ ఎలా సాధ్యమవుతుందని ఆయన జోన్ల జనరల్ మేనేజర్లను ప్రశ్నించారు. తక్షణమే వారిని రిలీవ్ చేయాలని ఆదేశించారు. విశాఖలో కొత్త జోన్‌కు సుమారు 1,500 నుంచి 2,000 మంది ఉద్యోగులు అవసరం. వారంతా వివిధ ప్రాంతాల నుంచి ఒకేసారి ఇక్కడికి వస్తే వారికి పోస్టుల కేటాయింపు, వసతి కల్పించడం కష్టమని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఆపరేషన్ తేదీ ప్రకటించిన నెల రోజుల్లోనే అన్నీ జరిగిపోవాలని అంటున్నారని, దీనికి కొంత సమయం పడుతుందని పేర్కొంటున్నారు. ఇది దశల వారీగా జరగాల్సిన వ్యవహారమని, అందుకే కాసింత ఆలస్యమవుతున్నదని అంటున్నారు. ఒకేసారి వందలాది మంది వస్తే ఎవరికి ఏ పోస్టు ఇవ్వాలో అర్థం కాని పరిస్థితి ఉందని, అందుకే సమయం తీసుకుంటున్నారని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఏ లేఖ వచ్చినా ఇక్కడి పర్సనల్ విభాగమే చూడాలని, ఇది సంధికాలమని, ఒత్తిడి పెడితే సమస్యలు ఎక్కువ అవుతాయని, కాసింత సమయం ఇస్తే అన్నీ సక్రమంగా చేస్తామని అంటున్నారు.

## బాబోయ్ ఎండలు..



**పాలకొండ, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజూ 45 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి వేళల్లోనూ వాతావరణంలో వేడి ఏ మాత్రం తగ్గడం లేదు. మరోవైపు ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఎండ తారెత్తించింది. ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ భానుడు తన ప్రతాపం చూపాడు. దీంతో జిల్లావాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ క్రమంలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, కొమరాడలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. వేసవి తాపాన్ని మూగ జీవాలు కూడా తట్టుకోలేకపోతున్నాయి. ఉదయం 11 గంటల తర్వాత కాపరులు మూగజీవాలను చెట్లుకిందకు తరలించి సేదతీరేలా చూస్తున్నారు. మరోవైపు వన్య ప్రాణులు కూడా తాగునీటి కోసం కటకటలాడుతున్నాయి. మైదాన ప్రాంతాలకు తరలివచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఉపాధి వేతనదారులు కూడా వేసవి తాపానికి అల్లాడిపోతున్నారు. కొందరు చెట్ల కిందకు చేరుతున్నారు. సకాలంలో ఐరీస్ పడక వారు ఎండలో నిరీక్షించాల్సి వస్తుంది.

## ఐరిస్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలి



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పనుల్లో కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 'ఐరిస్ మస్టర్' విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంటపాడు మండలం అల్లంపురం గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి, ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, గతంలో వేసవి తీవ్రతను తట్టుకునేందుకు కల్పించిన మజ్జిగ, మంచినీరు, నీడ వంటి కనీస సౌకర్యాలను ప్రస్తుతం ప్రభుత్వం తొలగించిందని సోమరాజుకు వివరించారు. తక్షణమే ఆ సౌకర్యాలను పునరుద్ధరించాలని కూలీలు నినాదాలు చేశారు. అనంతరం సోమరాజు మాట్లాడుతూ.. ఇటీవల కాకినాడ జిల్లాలో సర్వర్ పని చేయకపోవడంతో, ఐరిస్ మస్టర్ వేయించుకోవడం కోసం రోడ్డుపైకి వచ్చిన ఉపాధి కూలీలపైకి లారీ దూసుకెళ్లిన ఘటనను గుర్తుచేశారు. ఈ ఘోర ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతూ మరొకరు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, మరణించిన కూలీల కుటుంబాలకు తక్షణమే రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈనెల 20వ తేదీన చేపట్టబోయే 'గ్రామ సచివాలయాల ముట్టడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు.. మంత్రుల ప్రకటన



**అమరావతి, పతాకం న్యూస్:** ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సచివాలయంలో ఈరోజు(సోమవారం) సమీక్ష నిర్వహించారు. జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని మంత్రులు ప్రకటించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. గత సీజన్‌లో 2025-26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్-2026 ప్రణాళికలు, ఎల్ నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండు-మూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు.

## రంగంలోకి గంజాయి డిటెక్షన్ కిట్లు: ఎస్పీ దామోదర్




**విజయనగరం, పతాకం న్యూస్:** గంజాయి తీసుకున్న వారిని పట్టుకునేందుకు పోలీసు శాఖ గంజాయి డిటెక్షన్ కిట్లను రంగంలోకి దింపిందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. యాంటీ గంజాయి టీం, ఈగల్ టీం శనివారం నిర్వహించి న తనిఖీల్లో విజయనగరం పట్టణం, వీటీ అగ్రహారం, బీసీ కాలనీకి చెందిన మాడుగుల మహేష్‌ను డ్రగ్ డిటెక్షన్ కిట్ ద్వారా పరీక్షించగా.. గంజాయి తీసుకున్నట్టు నిర్ధారణ అయిందని ఆయన చెప్పారు. ఈ గంజాయి డిటెక్షన్ కిట్లు అత్యా ధునిక సంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారని, వీటి ద్వారా కేవలం ఒక నిమిషంలోనే వ్యక్తి గంజాయి తీసుకున్నాడా లేదా.. అని నిర్ధారణ చేయవచ్చని ఎస్పీ తెలిపారు. జిల్లాలో గంజాయి నియంత్రణ కోసం పోలీస్, ఈగల్ అధికారు లు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. పాఠ శాలలు, కళాశాలలు, ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో తరచూ తనిఖీలు నిర్వహి స్తామన్నారు. అలాగే జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెంచినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కఠినతరం చేశామని చెప్పారు. గంజాయి తీసుకుంటే జైలు తప్పదని.. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## రోడ్డు సౌకర్యం లేక గర్భిణికి తిప్పలు



**పెదబయలు, పతాకం న్యూస్ :** రోడ్డు సౌకర్యం లేక పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి రెండు కిలోమీటర్లు నడిచి అంబులెన్స్‌లో వెళ్లి ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. మండలంలోని అనేక గ్రామాలకు పక్కా రోడ్డు సదుపాయం లేక గిరిజనులు అత్యవసర సమయాల్లో నానా పాట్లు పడుతున్నారు. మారుమూల బొంగరం పంచాయతీలోని కొండ శిఖర గ్రామమైన వెదురుగొయ్యికి చెందిన చిక్కుడు సీమాలి అనే నిండు గర్భిణికి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆశ కార్యకర్తకు సమాచారం అందించారు. ఆమె అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం లేని కారణంగా అంబులెన్స్ చేరుకోలేదని డ్రైవర్ చెప్పాడు. గర్భిణిని వంచుర్భ గ్రామం వద్దకు తీసుకురావాలని అంబులెన్స్ డ్రైవర్ చెప్పాడు. దీంతో చేసేది లేక వెదురుగొయ్యి గ్రామం నుంచి వంచుర్భ వరకు రెండు కిలోమీటర్లు అతి కష్టంగా నడిపించుకుంటూ గర్భిణిని తీసుకువచ్చారు. గర్భిణి వచ్చేటప్పటికి అంబులెన్స్ రాకపోవడంతో అక్కడ చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఓవైపు పురిటినొప్పులు.. మరోవైపు నడకతో అలసటతో గర్భిణి చాలా ఇబ్బంది పడింది. చివరకు అంబులెన్స్ రావడంతో గోమంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యుడు పరిశీలించి ఆమెకు రక్తంగా ఉండడంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో గర్భిణి సీమాలి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు రక్తం ఎక్కించేందుకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. వెదురుగొయ్యి గ్రామంలో 35 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నిత్యజీవితంలో తీవ్ర కష్టాలు పడుతున్నారు. దీంతో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు చేరుకోవడం కష్టంగా మారింది. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, పండించిన పంటలను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు రవాణా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెదురుగొయ్యి గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నవ వధువు ఆత్మహత్య



**కాకినాడ, పతాకం న్యూస్ :** కాళ్ల పారాణి ఆరకముందే నవవధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో జరిగింది. గోనేడ గ్రామానికి చెందిన సత్యం శెట్టి వెంకటలక్ష్మికి పెద్దాపురం మండలం మర్లవ గ్రామానికి చెందిన గాది కోటేశ్వరరావుకి ఈ సంవత్సరం ఏప్రిల్ 25 తేదీన వివాహం చేశారు. వివాహం జరిగి కనీసం నెల కూడా కాకుండానే భర్త వెంకటలక్ష్మిని వేధింపులు పెట్టడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి కిర్లంపూడి ఎస్సై సతీష్ , పోలీసులు చేరుకున్నారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేధిస్తున్న ఆర్‌వోల కొరత



**విజయనగరం, పతాకం న్యూస్ :** భోగాపురం మండలంలో 16 సచివాలయాలు ఉండగా 8 సచివాలయాలకు మాత్రమే గ్రామ రెవెన్యూ కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 8 సచివాలయాలకు పక్క సచివాలయ అధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి మరో సచివాలయ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారిపై అదనపు పనిభారం ఉంటోంది. కొత్తవలస మండలంలో మొత్తం 21 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 14 సచివాలయాలకు గ్రామ రెవెన్యూ కార్యదర్శులు ఉండగా, మిగిలిన వాటికి లేరు. అటువంటి చోట్ల ఇన్‌చార్జిలే విధులు నిర్వహిస్తున్నారు. గంట్యాడ మండలంలో 22 గ్రామ సచివాలయాలు ఉండగా నాలుగు సచివాలయాలకు గ్రామ రెవెన్యూ కార్యదర్శులు లేరు. జిల్లాలోని చాలా మండలాల్లో వీఆర్‌వోల కొరత ఉంది. పూర్తిస్థాయిలో రెవెన్యూ కార్యదర్శులు లేక మిగిలినవారిపై పనిభారం పడుతోంది. గ్రామాల్లో రెవెన్యూ కార్యదర్శులకు కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా అప్పగించే ప్రతి పనికి వీరే బాధ్యులు. వీరు లేనిచోట ఇన్‌చార్జిలతో పనులు సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రెవెన్యూ సమస్యలతో పాటు ఓటు హక్కు నమోదు, పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారం, సర్వేలు ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 982 రెవెన్యూ గ్రామాల్లో 620 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటికి 530 పోస్టులు మంజూరు అయ్యాయి. 399 మంది వి?ధులు నిర్వహిస్తుండగా 131 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. చాలా సచివాలయాల పరిధిలో రెండు లేదా అంతకు మించిన గ్రామాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో పనిచేసేవారు కొరత ఉండటంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. కొన్నిచోట్ల కార్యదర్శులు నాలుగు నుంచి ఐదు గ్రామాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారిపై పని భారం తీవ్రంగా ఉంటోంది. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే ఆయా గ్రామాల్లో పాలన మెరుగవుతుంది.

## రోడ్డు నిర్మాణంలో.. నాణ్యతా లోపాలు!

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మిస్తోంది. అయితే పనుల నిర్వహణపై కొందరు అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనుల నాణ్యతను పట్టించుకోవడం లేదు. దీంతో పనులు పూర్తికాకుండానే శిథిలమై వర్షాలకు రోడ్లు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటోంది. పలుచోట్ల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ఒక్కటైపోతుండడం కూడా ఈ పరిస్థితి కారణమన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొమరాడ మండలం గుణానపురం నుంచి సీతారాంపురం వరకు పీఎం గ్రామీణ సడక్ యోజన రహదారి కోసం రూ.56 లక్షలు మంజూరు చేశారు. ఈ బీటీ రోడ్డు పనులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. రహదారాకి ఇరువైపులా బెర్మలు వేయలేదు. తారు కూడా తేలి మట్టి దర్శనమిస్తుండడంతో గిరిజన గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మక్కువ మండలంలో గిరిశిఖర ప్రాంతం చెలకమెండంగి నుంచి శిరివర వరకు ఆరు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.9.25కోట్లు మంజూరయ్యాయి. గతేడాది ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతవరకు కనీసం 30శాతం పనులు కూడా పూర్తికాలేదు, పైగా చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. అనతికాలంలోనే ఈ రోడ్డు పూర్తిగా పాడవడంపై గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురై కొట్టుకుపోయాయి. నాసిరకం మెటల్, జీఎస్పీ వాడటంతోపాటు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు పాచిపెంట మండలంలో ఆలూరు నుంచి మోదిగ వరకు గిరిశిఖర ప్రాంతంలో హడావుడిగా బీటీ రహదారి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో గిరిజనులు పెదవి విరుస్తున్నారు. పనులు ఇలానే చేస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సుమారు రూ.నాలుగు కోట్ల అంచనాతో ఈ ప్రాంతంలో రోడ్డుతో పాటు వంతెనతో పనులు చేపట్టారు. అయితే ఈ మార్గంలో గాదెలమడ - పెదమడల మధ్యలో ఉన్న మలుపు వద్ద తూతూమంత్రంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోదిగ పంచాయతీకి ఆరోగ్య కేంద్రం మంజూరు చేసింది. అయితే దీనికి బోరు అవసరమైనా.. ఏర్పాటు చేయలేక పోయారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో రిగ్గు వాహనం ఆ ప్రాంతానికి చేరుకోలేకపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిపుత్రులు కోరుతున్నారు.

# నీరున్నా.. బీడుగా మారుతున్న భూములు!



**చిత్తూరు, పతాకం న్యూస్:** రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు మండల కేంద్రానికి సమీపంలో పాపాఘ్ని నది మీద 2008లో రూ.2,008 కోట్లతో వెలుగల్లు ప్రాజెక్టు నిర్మించారు. 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఎడమ కాల్వ 10 కిలోమీటర్ల పరిధిలో 600 ఎకరాలు, మొత్తం కుడి, ఎడమ కాల్వలు, ఉపకాల్వల కింద 24వేల ఎకరాల అయకట్టు ఉంది. కొన్నేళ్లగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతోంది. గత ప్రభుత్వం కాల్వల మరమ్మతులను నిర్లక్ష్యం చేయడంతో నీళ్లు సక్రమంగా పారే పరిస్థితి లేకుండా పోయింది.

గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న కుడికాల్వ కేవలం 58 కిలోమీటర్లకు 15 కిలోమీటర్లు మాత్రమే లైనింగ్ వేశారు. మిగతా కాల్వకు లైనింగు వేయకపోవడం వల్ల నీరంతా ఎక్కడికక్కడ వృథాగా కారిపోతోంది. పందికుంట, కొరప్రకుంట గ్రామాల పరిధి అటవీ ప్రాంతంలో వెళ్తున్న కాల్వ ఎక్కడ చూసినా రంధ్రాలు పడి నీళ్లన్నీ కారి ఏటిపాలవుతున్నాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో వెళ్తున్న కాల్వలకు కూడా లైనింగ్ లేకపోవడం వల్ల చాలా నీరు వృథాగా పోతున్నాయి. ప్రాజెక్టులోని నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకుని ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపడానికి విడుదల చేశారు. గాలివీడు మండలంలోని కుడి కాల్వ కింద ఉన్న చెరువులు పూర్తిగా నిండాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని ఆయకట్టు భూములకు నీరు చేరుకోలేదు. 25శాతం నీరు కూడా చివరి ఆయకట్టుకు చేరుకోలేదని రైతులు చెబుతున్నారు.

వెలిగల్లు ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వల కింద 140 కిలోమీటర్ల పిల్ల కాల్వలున్నాయి. ఈ కాల్వలు మట్టి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వీటి గుండా నీరు సక్రమంగా పారే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

ప్రధాన కాల్వల ద్వారా కొంతమేర భూమి మాత్రమే సాగులోకి వస్తుందని, పిల్ల కాల్వల కింద అధిక మొత్తంలో సాగుభూమి ఉందన్నారు. కొన్ని కాల్వలు కూలిపోయాయని, మరికొన్ని దెబ్బతిన్నాయని వివరించారు. వీటిని బాగు చేస్తే అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు. కుడి కాల్వకు లైనింగ్ వేయకపోవడం, కాల్వలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల భూములన్నీ బీడుగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల వర్క్ ఫ్రం హోమ్‌పై భిన్నాభిప్రాయాలు



**అమరావతి, పతాకం న్యూస్:** పొదుపు చర్యల్లో భాగంగా ప్రతిపాదించిన వర్క్ ఫ్రం హోమ్ విధానంపై ప్రభుత్వ ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధ్యాసాధ్యాలపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతుండగా, మార్గదర్శకాల జారీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంలో పలు రకాల పని విధానాలు అమల్లో ఉన్నాయి. నేరుగా సచివాలయాల్లో కూర్చుని ఫైల్స్ చూసేవాళ్లు కొందరైతే వాటిని అమలు చేసే బాధ్యత కలిగిన శాఖాధిపతులు మరికొందరు. ఇక క్షేత్రస్థాయి నుంచి తప్పనిసరిగా ఫీల్డ్ లోకి వెళ్లి పనిచేయాల్సిన వారూ ఉన్నారు. తాజా మాజీ అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం సచివాలయంలో 32 వరకు శాఖలు ఉన్నాయి. వీటిలో సీనియర్ ఐఎఎస్ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ స్థాయి వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి అదనంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా వేలాదిమంది విధులు నిర్వహిస్తున్నారు. అనేక సమయాల్లో ఇతర శాఖలతోనూ అనుసంధానం చేసుకుని వీరు పనిచేయాల్సిఉంటుంది. హెచ్‌ఓడిలలో కూడా ఇతర శాఖల సమన్వయంతో ఫైళ్లు తయారవుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో వర్క్ ఫ్రం హోం విధానం మంచి ఫలితాలు ఇవ్వదన్న అభిప్రాయం వ్యక్త మవుతోంది. పనిచేస్తున్న భావన కలగాలన్నా కూడా అందరు ఒకే దగ్గరి ఉండి పనిచేయడం అవసరమని చెబుతున్నారు. యూనిఫాం పోస్టుల్లో విధులు నిర్వహించేవారు, నిర్మాణ పనులతో సంబంధం ఉండేవారు కూడా ఇళ్ల నుండి పనిచేయడం సాధ్యం కాదు. అయితే, ప్రధానమంత్రే స్వయంగా చెప్పడంతో, దీనిపై ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి చంద్రదబాబునాయుడు సైతం అధికారులకు సూచించారు. ఇక ఇంటి నుండి పనిచేయాలంటే ల్యాప్‌టాపో, కంప్యూటరో ఉద్యోగులకు తప్పనిసరి. ప్రస్తుతం ఎంత మంది వద్ద ఇవి ఉన్నాయో తెలియని స్థితి. ఒకవేళ ప్రభుత్వమే సమకూర్చాల్సివస్తే తడిసి మోపెడయ్యే అవకాశం ఉంది.

## వేతన సవరణలో జాప్యం.. ప్రభుత్వానికి ఏపీఎన్జీవోల కీలక డిమాండ్లు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) చైర్మన్‌ను తక్షణమే నియమించాలని ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్ అధికారుల (ఏపీఎన్జీవో) సంఘం డిమాండ్ చేసింది. విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు సంఘం అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ తెలిపారు. 2023 నుంచి వేతన సవరణ ప్రక్రియ నిలిచిపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అనిశ్చితి, ఆందోళన నెలకొన్నాయని విద్యాసాగర్ అన్నారు. "వేతన సవరణ సంఘాన్ని నియమించడంతో పాటు మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని" ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ 2023లోనే పీఆర్సీని నియమించిందని, కేంద్ర ప్రభుత్వం కూడా 2026 వేతన సవరణ ప్రక్రియను మొదలుపెట్టిందని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో మరికొన్ని కీలక అంశాలపై కూడా చర్చించారు. 2004కు ముందు నోటిఫై అయిన ఉద్యోగులను పాత పింఛను పథకం (ఓపీఎస్) పరిధిలోకి తీసుకురావాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తీర్మానించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని కూడా కోరారు. ఇటీవల ప్రభుత్వం జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ వంటి బకాయిల కింద సుమారు రూ.21 వేల కోట్లు విడుదల చేయడాన్ని సంఘం స్వాగతించింది. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు వి. దస్తగిరిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. జగదీశ్వరరావు, కోశాధికారి భారతీ ప్రసాద్, ప్రతినిధులు ఎల్. బొంజయ్య, ఆర్ఎస్ హరినాథ్, జానీ పాషా, షేక్ మహ్మద్, పి. కిరణ్ కుమార్, షేక్ నాగూర్, వై. ప్రసాద్, ఎస్. రాజశేఖర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాశీకి వెళ్తుండగా.. ట్రావెల్స్ బస్సు బోల్తా



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** కంచిలి మండలంలోని బూరగాం జాతీయ రహదారి వద్ద ట్రావెల్స్ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు కాగా, 40 మంది యాత్రికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం పెద్ద కడుపూరు మండలం దొడ్డిమేకల గ్రామం నుంచి ఈనెల 14వ తేదీ రాత్రి 10 గంటలకు 40మంది యాత్రికులతో ట్రావెల్స్ బస్సు కాశీకి బయలుదేరింది. సుమారు 30 క్షేత్రాలను దర్శించుకోవాలని యాత్రికులు అనుకున్నారు. అయితే, కంచిలి మండలం బూరగాం సమీపానికి వచ్చే సమయంలో పక్కనుంచి వస్తున్న లారీ తగులుతుందేమోనని డ్రైవర్ దాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి రోడ్డుపక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నాగూరు వీరప్రతాప్ రెడ్డితో పాటు పామిడి గ్రామానికి చెందిన ట్రావెల్స్ ఏజెంట్ ఆదినారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. యాత్రికులందరూ క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టుల భర్తీకి రంగం సిద్ధం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. తాజా నివేదిక ప్రకారం అంబేద్కర్ వర్సిటీలో మొత్తం 46 అధ్యాపక పోస్టుల భర్తీకి ఆమోదం లభించింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలకు చెందిన రెగ్యులర్ పోస్టుల్లో కొన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. అంబేద్కర్ వర్సిటీకి అత్యధికంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. విభాగాల వారీగా ఖాళీలు, రిజర్వేషన్లను ప్రకటించారు. 4 ప్రొఫెసర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. వీటిలో ఓసీ- 2, బీసీ ఏ- 1, ఎస్సీ- 1 పోస్టు కేటాయించారు. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 12కుగాను రెగ్యులర్ 10, ఎస్సీ బ్యాక్‌లాగ్- 2 పోస్టులను కేటాయించారు. ఇందులో ఓసీ- 5, బీసీ ఏ- 1, బీసీ బీ- 1, ఎస్సీ- 2, ఎస్టీ- 1 పోస్టులు కేటాయించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు- 2 ఎస్సీ అభ్యర్థులకు కేటాయించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 30 కాగా, ఇందులో 28 రెగ్యులర్ పోస్టులు, 2 బ్యాగ్‌లాగ్ పోస్టులు భర్తీ కానున్నాయి. రెగ్యులర్ పోస్టుల్లో ఓసీ- 12, ఈడబ్ల్యూఎస్- 2, బీసీ ఏ- 2, బీసీ బీ- 2, బీసీ సీ- 1, బీసీ డీ- 1, బీసీ ఈ- 1, ఎస్సీ- 5, ఎస్టీ- 2, బ్యాక్‌లాగ్ పోస్టులు-2లో బీసీ ఏ -1, ఎస్సీ-1 పోస్టు కేటాయించారు. బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటై 18 ఏళ్లు అవుతున్నా, అరకొర రెగ్యులర్ బోధనా సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. వర్సిటీలో ఏడుగురు రెగ్యులర్ అధ్యాపకులు మాత్రమే ఉండగా, మిగిలిన వారంతా కాంట్రాక్ట్, సబ్జెక్ట్ కాంట్రాక్ట్‌తోనే నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఒకేసారి 46 రెగ్యులర్ అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు సాధించి ఏళ్ల తరబడి వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల నియామకం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఇది ఒక సువర్ణావకాశంగానే భావించాలి. నియామక ప్రక్రియ పూర్తయితే వర్సిటీలో విద్యా ప్రమాణాలు మెరుగుతో పాటు, పరిశోధనకు మరింత ఊతం ఇచ్చినట్టువుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## వరి విత్తనాలు సిద్ధం!



**టెక్కలి, పతాకం న్యూస్:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లామొత్తంగా 1,54,230 హెక్టార్లలో వరి పండించే ప్రాంతం ఉండగా.. 31,058 క్వింటాళ్ల తొమ్మిది రకాల వరి విత్తనాలను ఏపీ సీడ్స్ ద్వారా అందించేందుకు సిద్ధం చేశారు. పదేళ్లు పైబడిన విత్తన రకాలు కిలోకు రూ.5 సబ్సిడీ, పదేళ్లు లోపు ఉన్న విత్తన రకాలకు కిలోకు రూ.10 సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి జిల్లా రైతులు రీసెర్చ్ వెరైటీ విత్తనాలపైనే ఆధారపడుతున్నారు. ఈ విత్తనాలను నూజివీడు ప్రైవేట్ సీడ్స్, తణుకు, తెలంగాణా రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, జగిత్యాల, సిద్ధిపేట, హుజూరాబాద్ తదితర ప్రాంతాల నుంచి నూజివీడు సంపద, కనెక్ట్‌ప్లస్, సుభద్ర, పూర్ణిమ, రాణి, అమూల్య గోల్డ్ తదితర రకాల విత్తన డీలర్లు తెచ్చి రైతులకు అమ్మకాలు చేస్తున్నారు. తెగుళ్లు సోకని, అధిక దిగుబడులు ఇచ్చే రీసెర్చ్ వెరైటీలపైనే మొగ్గు చూపుతుండడంతో వ్యవసాయశాఖ ద్వారా సరఫరా అవుతున్న కొన్నిరకాల విత్తనాలు ఏటా మిగిలిపోతున్నాయి. మరోవైపు 1010 రకం వరి పండించవద్దని, దాంట్లో బ్రోకెన్ శాతం ఎక్కువగా వస్తుందని ఇప్పటికే పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేయడంతో రైతులకు ఆ రకం విత్తనాల సరఫరా నిలిపివేశారు. రైతులకు అవసరమైన విత్తనాలను ఈ నెలాఖరు నాటికి పంపిణీ చేయనున్నారు.

## మండల కేంద్రాల్లో 'మహానాడు'



**సాలూరు, పతాకం న్యూస్:** మండల కేంద్రాల్లో 27, 28 తేదీల్లో మహానాడును నిర్వహించాలని నాయకులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. క్యాంప్ కార్యాలయంలో మక్కువ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో మహా నాడు నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మహానాడు ను నిర్వహణకు సరైన స్థలాన్ని ఎంపిక చేయా లన్నారు. రెండు రోజులు పాటు నిర్వహించే కార్యక్రమానికి హాజరయ్యే వారికి అల్పాహారం, భోజనాలు సమకూర్చాలన్నారు. మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ముఖ్య నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే మహానాడు లో పాల్గొంటున్నం దున మండల కేంద్రంలో మహానాడు నిర్వహణకు నాయ కులు సన్నాహాలు చేసుకోవాలన్నారు. మహానాడు వద్ద పెద్ద స్క్రీన్‌ను విధిగా ఏ ర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాలూరు టౌన్ అధ్యక్షుడు నిమ్మాది చిటి ?టబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆమదాల పరమేశ్వరావు, మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు, మెంటాడ మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.వెంకటరావు, నాయ కులు మత్స శ్యామ్‌సుందర్రావుపాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం



**సీతానగరం, పతాకం న్యూస్:** ఉపాధి నిధులతో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నామని ఉపాధి హామీ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ అన్నారు. అప్పయ్యపేటలో పిల్ల సాగునీటి కాలువలు, ఇంకుడు గుంతుల పనులను ఆయన ప్రారంభించారు. మండలం లో 10 వేల పనులకు నిధులు మంజూరయ్యా యన్నారు. పనులను నిర్దేశిత సమయంలో పూర్తిచేయిం చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతుల నిర్మాణం పై వేతనదారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాసరావు, ఏపీడీ త్రివిక్రమరావు, ఏపీవో బాలకృష్ణ, పాల్గొన్నారు.

## రెండో అత్యంత విలువైన కంపెనీగా ఎయిర్‌టెల్ రికార్డు




**సీతానగరం, పతాకం న్యూస్:** టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టింది. దీంతో దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడటంతో ఈ ఘనత సాధ్యమైంది. ఓ దశలో ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ఏకంగా రూ. 11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం దేశంలో రూ. 18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. గత వారం రోజుల్లో ఎయిర్‌టెల్ షేర్లు 10 శాతం మేర లాభపడ్డాయి. కానీ ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం మేర పతనమవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన ప్రదర్శన కనబర్చింది. ఈ బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ. 1,912 కోట్లకు చేరింది.

## ట్రాక్టర్ బోల్తా.. 9 మంది కూలీలకు గాయాలు




**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** కె.వి పల్లి మండలంలోని కలకటవారిపల్లి సమీపంలో మలుపు వద్ద ఆదివారం ట్రాక్టర్ ఏపీ 39ఎన్‌కే 6935 నెంబర్ గల ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. దామలచెరువు నుండి మామిడికాయలు కోయటానికి 12 మంది కూలీలతో మారెళ్ళకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మలుపు వద్ద ట్రాక్టర్ నియంత్రణ కోల్పోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 9 మందికి రక్త, గీకుడు గాయాలు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ చుక్కలపాటి లక్ష్మయ్య (22) సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడినవారిలో జింకల జ్యోతి (32), చుక్కలపాటి గౌరీ (22, గర్భిణి), చుక్కలపాటి రమేష్ (43), చుక్కలపాటి రాజేశ్వరి (35), టి. సుగుణ (28), పి. మౌనిక (20), పి. మనోహర (25), శ్రీ నక్షత్ర (2), పి. సిద్దు (9) ఉన్నారు. వీరందరూ ఇర్లపాలెం--ఎర్రవారిపాలెం ప్రాంతాలకు చెందినవారని తెలిసింది. గాయపడినవారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేయగా, పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట శివకుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన బంటుమిల్లి మండలం పెద్ద తుమ్మిడి మురుగు కాలువ సమీపంలో ఉదయం జరిగింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. మృతులను ఏనుమల శివయ్య (34), కాగిత అమలేశ్వరరావు (30)గా పోలీసులు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హల్‌చల్ చేస్తున్న ఏనుగులు



**విజయనగరం, పతాకం న్యూస్:** జియ్యమ్మవలస, భామిని మండలాల్లో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. పంటలు, వ్యవసాయ సామగ్రిని ధ్వంసం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గజరాజులు జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి నుంచి పరజపాడు పొలిమేరకు చేరుకున్నాయి. అక్కడ నుంచి కుందరతిరువాడకు వెళ్లి అరటి, చెరకు, వరి పంటలను నాశనం చేశాయి. ప్రస్తుతం అవి కుదమ, కేటీ వాడ గ్రామాల మధ్య అరటి తోటల్లో తిష్ఠ వేశాయి. దీంతో ఆ రెండు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటలు పూర్తిగా నాశనం కాకముందే ఏనుగులను ఇక్కడి నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇక భామిని మండలం దిమ్మిడిజోల మామిడి తోటల్లో ఆదివారం నాలుగు ఏనుగులు సంచరించాయి. అక్కడున్న పాకతో పాటు నిల్వ ఉంచిన మామిడికాయలు, పళ్లు ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత సోమవారం బాలేరులో సంచరించిన ఏనుగులు వంశధార నది అవతల గ్రామాలకు వెళ్లాయి. శనివారం రాత్రి తిరిగి దిమ్మిడిజోలకు చేరాయి. మొత్తంగా గజరాజులు ఏ రోజు ఏ ప్రాంతంలో ఉంటాయో తెలియక వంశధార నదీతీర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మరోవైపు ఫారెస్ట్ సిబ్బంది, బీట్ అధికారి కేశవ ఏనుగులు సంచరిస్తున్న ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## ఉపాధి కూలీలకు తార్పాలిన్లను పంపిణీ



**విజయనగరం, పతాకం న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు విజయనగరం మండల టీడీపి ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు సోమవారం ఉదయం తార్పాలిన్లను పంపిణీ చేశారు. మండలంలోని రామ జోగిపేట పరిధిలో గల దోజు బంధ, బడుకొండపేట నరసరాజు చెరువుల వద్ద పనిచేస్తున్న ఆయా గ్రామాల ఉపాధి కూలీలకు ఆయన వీటిని అందజేశారు. మొత్తం 8 కూలీల జట్లకు గానూ, తన సొంత ఖర్చులతో ఎనిమిది తార్పాలిన్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పిన్నింటి వెంకటలక్ష్మితో పాటు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# లివర్ వ్యాధులు ఉంటే చర్మం ఈ లక్షణాలను తెలియజేస్తుంది..!

సాధారణంగా కాలేయ వ్యాధులు చాలా నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతాయి. సమస్య మొదలయ్యే ముందు సంకేతాలు తక్కువగా ఉండడం లేదా అస్సలు ఉండక పోవడం జరుగు తుంది. దీంతో లక్షణాలను గుర్తించలేక చాలా మంది తీవ్ర అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. కానీ మన చర్మం కాలేయ వ్యాధి లక్షణాలను చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు చాలా సూక్ష్మమైనవే అయినప్పటికీ తీవ్రమైన కాలేయ సమస్యలను సూచిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. చర్మం పసుపు రంగులోకి మారడం, దురద వంటి లక్షణాలు హెపటైటిస్ వంటి తీవ్రమైన సమస్యలను సూచిస్తాయి. ఈ లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం వల్ల మనం తీవ్ర అనారోగ్యానికి గురి కాకుండా ఉంటాం. కాలేయ సమస్యలను తెలియజేసే, విస్మరించకూడని చర్మ సంబంధిత లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### చర్మం పసుపుగా మారడం..

కాలేయ పనితీరు దెబ్బతినడం వల్ల కనిపించే సాధారణ లక్షణాల్లో కామెర్లు ఒకటి. ఎర్ర రక్తకణాల విచ్ఛిన్నం ఫలితంగా ఏర్పడే బైలిరుబిన్ ను కాలేయం ప్రాసెస్ చేయలేదు. దీంతో పసుపు రంగులో ఉండే బైలిరుబిన్ రక్తం, కణజాలాలలో పేరుకుపోతుంది. దీనివల్ల చర్మం పసుపు రంగులోకి మారుతుంది. కామెర్లు తీవ్రమైన కాలేయ అనారోగ్యానికి సంకేతం కనుక ఈ లక్షణం కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. మన శరీరంలో ముఖం, మెడ, చేతులు, ఛాతిపై ఎరుపు రంగులో వెబ్ ఆకారంలో రక్తనాళాలు విస్తరించి కనిపిస్తాయి. కాలేయం ఈస్ట్రోజన్ హార్మోన్ ను సరిగ్గా జీవక్రియ చేయలేనప్పుడు ఇలా జరుగుతుంది. ఇది దీర్ఘకాలంగా కాలేయం పనిచేయక పోవడాన్ని సూచిస్తుంది. ఆల్కహాల్ లేదా బలహీనమైన కాలేయ పనితీరు ఉన్న వ్యక్తుల్లో చర్మంపై సాలీడు (వెబ్) లాంటి రక్తనాళాలు ఎక్కువగా కనిపిస్తాయి. గర్భిణీ స్త్రీలల్లో కూడా ఇవి కనిపిస్తాయి. అయితే అకస్మాత్తుగా ప్రారంభమైతే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

### అరచేతుల్లో ఎరుపుదనం..

అరచేతిలో అలాగే బొటనవేలు, చిటికిన వేలు బేస్ వద్ద నిరంతరం ఎరుపుగా ఉంటుంది. దీర్ఘకాలిక కాలేయ వ్యాధి కారణంగా రక్తప్రవాహంలో, హార్మోన్ల అసమతుల్యత కారణంగా ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఫ్యాటీ లివర్ తో పాటు ఆటోఇమ్యూన్ హైపటైటిస్, కాలేయ ఒత్తిడి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడే వారిలో ఎక్కువగా ఈ లక్షణం కనిపిస్తుంది.

ఇటువంటి కాలేయ సమస్యలు కూడా తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తాయి కనుక నిర్లక్ష్యం చేయకూడదు. కాలేయం పని చేయకపోవడం వల్ల రక్తంలో పిత్త ఆమ్లాలు పేరుకుపోతాయి. దీంతో తీవ్రమైన దురద వస్తుంది. ముఖ్యంగా రాత్రి సమయంలో దురద ఎక్కువగా ఉంటుంది. చేతులు, కాళ్లు, అవయవాలను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. కొలెస్టాసిస్ లేదా ప్రైమరీ బిలియరీ కోలాంగైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారిలో దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలం పాటు భరించలేని దురద ఉన్నట్లయితే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

### చర్మంపై నల్లని మచ్చలు..

చర్మం నల్లగా మారడంతో పాటు కళ్లు, నోరు, చంకల చుట్టూ కూడా చర్మం నల్లగా మారుతుంది. దీర్ఘకాలిక కాలేయం వ్యాధితో బాధపడే వారిలో ఇలా జరుగుతుంది. హార్మోన్ల అసమతుల్యత, ఇన్సులిన్ నిరోధకత కారణంగా, కాలేయం పనిచేయకపోవడం వల్ల శరీరంలో మెలనిన్ పెరగడం వల్ల ఇలా జరుగుతుంది. హిమోక్రోమాటోసిస్, ఆటో ఇమ్యూన్ లివర్ డిసీజ్, నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారిలో హైపర్ పిగ్మెంటేషన్ కలుగుతుందని అధ్యయనాల ద్వారా కనుగొన్నారు.

ఇక లక్షణాలు మొదట్లో చిన్నగా ఉన్నప్పటికీ కాలేయ వ్యాధిని గుర్తించడంలో కీలకంగా పనిచేస్తాయి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయడం, మద్యపానం మానేయడం, క్రమంగా తప్పకుండా కాలేయ సంబంధిత పరీక్షలు చేయించుకవడం వల్ల కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముందుగా గుర్తించడం వల్ల కాలేయ నష్టాన్ని తగ్గించడంతో పాటు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు.

## అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయి: ఇరాన్



**ఇరాన్:** పాకిస్థాన్ మధ్యవర్తిత్వం ద్వారా అమెరికాతో పరోక్ష చర్చలు చురుకుగా కొనసాగుతున్నాయని ఇరాన్ సోమవారం ధ్రువీకరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేసినప్పటికీ, తమ అణు హక్కుల విషయంలో రాజీపడబోమని టెహ్రాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి చెప్పినట్లు ఐఎస్ఎన్ఏ పేర్కొంది. పాకిస్థాన్ ద్వారా వాషింగ్టన్‌తో ఇరాన్ ప్రతిపాదనలు, సవరణ అంశాలను మార్పిడి చేసుకుందని ఆయన వివరించారు. చర్చలు కొనసాగుతున్నాయని, తాత్కాలికమైనవి కావని అన్నారు. అటు చురుకైన దౌత్య మార్గం ఉన్నప్పటికీ, ఇరాన్ తన అణు కార్యక్రమం విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తోందన్నారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం ప్రకారం యురేనియంను శుద్ధి చేసుకునే ఇరాన్ హక్కుపై రాజీ కుదరదని బఘాయి తేల్చి చెప్పారు. "మేము 14 సూత్రాల ప్రణాళికను సమర్పించిన తర్వాత అమెరికా తమ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. మేము కూడా మా ఆందోళనలను తిరిగి వాషింగ్టన్?కు చెప్పాము. ఇరాన్ ప్రణాళికను తిరస్కరించినట్లు అమెరికా బహిరంగంగా ప్రకటించినప్పటికీ, పాకిస్థానీ మధ్యవర్తి నుంచి మాకు కొన్ని సవరణ సూచనలు, పరిగణనలు అందాయి. అమెరికాకు మా అభిప్రాయాలను పంపిన మరుసటి రోజే, పాకిస్థాన్ నుంచి మాకు కొన్ని ప్రతిపాదనలు అందాయి. వాటిని గత కొద్ది రోజులుగా సమీక్షించాం. ఆ తర్వాత మా అభిప్రాయాలు కూడా తిరిగి అమెరికాకు పంపించాం. ఈ ప్రక్రియ పాకిస్థానీ మధ్యవర్తి ద్వారా కొనసాగుతోంది. హక్కుల విషయంపై చర్చలు జరపడానికి, రాజీపడటానికి మేము సిద్ధంగా లేమని ఖచ్చితంగా చెప్పగలం. యురేనియం శుద్ధి చేసుకునే ఇరాన్ హక్కును ఎన్‌పీటీ కింద గుర్తించారు. ఈ హక్కు ఇప్పటికే ఉన్నందున ఇతరులు ఇరాన్‌కు ఈ హక్కును గుర్తించాల్సిన అవసరం లేదు. మేము శత్రువు బెదిరింపులకు ఎలాగైతే భయపడమో, అలాగే వారి ప్రశంసలకు కూడా ఉత్సాహపడము. మేము మా సామర్థ్యాలను నమ్ముకున్నాం. శత్రువును ఎదుర్కోవడానికి భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తున్నాం" ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలియజేశారు. ప్రాంతీయ సముద్ర భద్రత, హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్- ఒమన్ మధ్య నిపుణుల స్థాయి చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి చాలా ముఖ్యమైన జలమార్గమని, నౌకా భద్రత చాలా ముఖ్యమని అన్నారు.

# అడుగంటిన జలాలు..

## అన్నదాత దిగాలు..



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ప్రధానంగా చెరువులు ఎండిపోతున్నాయి. ఫలితంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. నదులు, రిజర్వాయర్లలో సైతం నీరు కరువవుతోంది. దీంతో పశువులు, మూగజీవాలకు కూడా దాహార్తి తప్పడం లేదు. జిల్లాలోని 76 గ్రామాలు డార్క్‌జోన్‌లో ఉన్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. రణస్థలం మండలంలో 46 గ్రామాలు, లావేరు మండలంలో 18 గ్రామాలు, జి.సిగడాం మండలంలో 6 గ్రామాలు, పొందూరు మండలంలో 6 గ్రామాల్లో భూగర్భజలాలను అత్యధికంగా తోడేసిన ప్రాంతాలుగా వెల్లడించింది. ఆయా గ్రామాల్లో కొత్తబోర్లు, ఇసుక తవ్వకాలను నిషేధించింది. కాగా.. జిల్లాలో చాలాచోట్ల చెరువులు, నదుల్లో నీరు ఎండిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

శ్రీకాకుళం మండలం కళ్లేపల్లి వద్ద నాగావళి నదిలో నీరు లేక ఎడారిని తలపిస్తోంది. పొన్నాడ వంతెన వద్ద నాగావళిలో మురుగునీటి ప్రవాహమే దర్శనమిస్తోంది. అలాగే శ్రీకాకుళం రూరల్ పరిధిలో సాధుపేట, కనుగులవానిపేట, గంగిరేవు చెరువులు పూర్తిగా అడుగంటిపోయాయి. లావేరు చెరువు కూడా పూర్తిగా ఎండిపోయి.. మైదానాన్ని తలపిస్తోంది.

మందస మండలంలో తాగునీటికి ఉపయోగించే పలు చెరువులు నీరు లేక రూపం కోల్పోతున్నాయి. హొన్నాళిలో మంచినీటి కోనేరు.. చిన్నకొలనులా మారింది. బొందికారి కోనేరు కూడా చిన్న నీటి మడుగులా దర్శనమిస్తోంది. చాలాచోట్ల బావుల్లో నీరు లేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. కొండవాగుల్లో సైతం నీటి చెలమలు ఎండిపోవడంతో వన్యప్రాణులు నీటికోసం గ్రామ పరిసరాల్లోని చెరువులు, వాగుల్లోకి తరలివస్తున్నాయి. ఇక్కడ నీరు లేకపోవడంతో అడవి పందులు, జింకలు.. వేరుశెనగ, రాగి, వరి వంటి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలో సుమారు 40 గ్రామాల్లో నీటిఎద్దడి ఏర్పడింది. రక్షిత మంచినీటి పథకాల బావులు ఈ చెరువుల్లోనే ఉండడంతో వాటికి ముప్పు ఏర్పడుతోంది. మోటరు వేస్తే గంట కూడా నీరు రాని దుస్థితి నెలకొంది. ట్యాంకర్లద్వారా మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పలాస, మెళియాపుట్టి మండలాల్లోని రెండు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే వరహాలగెడ్డ (లొత్తూరు రిజర్వాయర్) కళ తప్పుతోంది. రిజర్వాయర్ కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. సిల్ట్ పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు పెరిగి నీటి నిల్వ సామర్థ్యం అడుగంటింది. పలాస, మందస సరిహద్దులో లొత్తూరుకు వెళ్లే రహదారిలో 1978లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.కోటికి పైగా నిధులతో వరహాలగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు. మహేంద్రతనయ కొండల నుంచి వచ్చే నీటిని నిల్వ చేసేందుకు ఈ వరహాలగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు. మెళియాపుట్టి, పలాస మండలాల్లోని సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు రెండువైపులా మదుములు, కుడి వైపు భారీ సర్‌ప్లస్ వియర్(పరుపు) నిర్మించారు.

కాగా నిర్వహణ లోపంతో కేవలం వర్షాకాలంలో తప్ప మిగిలిన రోజుల్లో కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు నిల్వ ఉండని దుస్థితి ఏర్పడుతుంది. కిలోమీటరు పొడవునా రిజర్వాయరు గట్టు నిర్మించినా దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. రిజర్వాయర్ గర్భాన్ని లోతు చేయడంతోపాటు పాడైన గట్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.




## రాజస్థాన్ రాయల్స్‌పై
# ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం



లీగ్ ఆరంభంలో వరుస విజయాలు సాధించిన జట్లకు ప్లేఆఫ్స్ ముంగిట ఉత్కంఠ తప్పడం లేదు. తాజాగా రాజస్థాన్ రాయల్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ చెక్ పెట్టింది. దీంతో రాజస్థాన్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. జరిగిన ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చిన ఢిల్లీ 5 వికెట్లతో గెలిచింది. అంతేకాకుండా 12 పాయింట్లతో అక్షర్ సేన తమ ఆశలను సజీవంగానే ఉంచుకొంది. మిగిలిన ఏకైక మ్యాచ్‌లో గెలవడం ఢిల్లీకి తప్పనిసరి. ఆ తర్వాత పంజాబ్, చెన్నై, రాజస్థాన్ ఫలితాల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (40 బంతుల్లో 5 ఫోర్లు 2 సిక్సర్లతో 53), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), వైభవ్ సూర్యవంశీ (21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) రాణించారు. మిచెల్ స్టార్క్‌కు నాలుగు.. మాధవ్ తివారి, ఎన్‌గిడిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 197 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ (42 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 56), అభిషేక్ పోరెల్ (31 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 51), అక్షర్ పటేల్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఆర్చర్, బ్రిజేశ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా స్టార్క్ నిలిచాడు. ఛేదనలో ఢిల్లీకి శుభారంభం దక్కింది. ఓపెనర్లు రాహుల్, పోరెల్ అర్ధసెంచరీలతో అండగా నిలిచారు. అయితే పది ఓవర్లలో 100 రన్స్ దాటిన ఢిల్లీ ఆటతీరు ఆ తర్వాత నెమ్మదించింది. తొలి వికెట్‌కు 105 రన్స్ జోడించాక పోరెల్ వెనుదిరిగాడు. అనంతరం సాహిల్ (9), రాహుల్ వేగంగా వికెట్లు కోల్పోవడంతో అక్షర్, స్టబ్స్ (4) నిదానంగా ఆడారు. చివర్లో హిట్టర్లు స్టబ్స్, మిల్లర్ (9) స్వల్ప వ్యవధిలోనే వెనుదిరగడంతో ఉత్కంఠ పెరిగింది. కానీ అశుతోష్ (5 బంతుల్లో 18 నాటౌట్) ధనాధన్ బౌండరీలతో మరో నాలుగు బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైస్వాల్ (12) విఫలమైనా మిగతా టాపార్డర్ బ్యాటర్లు చెలరేగారు. వీరి ధాటికి ఓ దశలో 14 ఓవర్లలోనే 160/2 స్కోరుతో ఉన్న రాజస్థాన్ 200ం సులువుగా సాధిస్తుందనిపించింది. కానీ పేసర్ స్టార్క్ ధాటికి కుదేలైంది. చివరి ఆరు ఓవర్లలో 33 పరుగులే చేసి 6 వికెట్లు కోల్పోయింది. మరోవైపు తొలి ఓవర్‌లోనే మూడు ఫోర్లతో జోరు చూపిన జైస్వాల్ రెండో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. మరో ఓపెనర్ వైభవ్ మాత్రం అదరగొట్టాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అతడు.. స్టార్క్ ఓవర్‌లోనూ 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక ఐదో ఓవర్‌లో 4,4,4,6తో 18 రన్స్ అందించాడు. అటు జురెల్ ఆరో ఓవర్‌లో 4,6,4తో దూకుడు ప్రదర్శించడంతో, పవర్‌ప్లేలో జట్టు 75/1 స్కోరుతో నిలిచింది. కానీ పేసర్ మాధవ్ తన తొలి ఓవర్‌లోనే వైభవ్ వికెట్ తీయడంతో రెండో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం పరాగ్ ఫటాఫట్ బ్యాటింగ్ సాగించాడు. అక్షర్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన అతను పేసర్ ముకేశ్ ఓవర్‌లో 6,4,6,6తో 23 పరుగులు రాబట్టాడు. ఈ జోరుతో పరాగ్ 23 బంతుల్లోనే తన ఫాస్టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేశాడు. కానీ 15వ ఓవర్‌లో స్టార్క్ ఝలక్ ఇస్తూ పరాగ్, ఫెరీరా (0), రవి సింగ్ (4)ల వికెట్లు తీశాడు. పరాగ్-జురెల్ మధ్య మూడో వికెట్‌కు 72 పరుగులు సమకూరాయి. ఆ తర్వాత మరింతగా తడబడిన రాజస్థాన్ చివరి 30 బంతుల్లో 27 పరుగులే చేసి 3 వికెట్లు కోల్పోయింది. అర్ధసెంచరీ చేసిన జురెల్ చివరి ఓవర్‌లో వెనుదిరిగినా వేగంగా ఆడలేకపోయాడు.

## రిటైర్‌మెంట్‌పై ఐదేళ్ల క్రితమే ధోని హింట్!



చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోని ఐపీఎల్ కెరీర్‌కు ముగింపు పలకనున్నాడా? ఈ ప్రశ్న ప్రస్తుతం క్రికెట్ అభిమానులను తీవ్రంగా కలవరపెడుతోంది. చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు సోమవారం తలపడనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నైకి ఇదే ఆఖరి హోం గ్రౌండ్ మ్యాచ్. దీంతో ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోని ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగి.. రిటైర్‌మెంట్ ప్రకటిస్తాడనే వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ధోని రిటైర్‌మెంట్‌పై ప్రచారం ఊపకుందున్న నేపథ్యంలో.. ఐదేళ్ల క్రితం తన రిటైర్‌మెంట్ గురించి తలా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ చర్చనీయాంశం అయింది. 2021 ఐపీఎల్ ట్రోఫీని చెన్నై సూపర్ కింగ్స్ గెలిచిన సంగతి తెలిసిందే. అప్పుడు టైటిల్ వేడుకల సందర్భంగా ధోని తన రిటైర్‌మెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నా క్రికెట్ ప్రయాణాన్ని ఎప్పుడూ ముందుగానే ప్లాన్ చేసుకుంటాను. నా చివరి వన్డే మ్యాచ్ నా స్వస్థలం రాంచీలో ఆడాను. అలాగే నా చివరి టీ20 మ్యాచ్ చెన్నైలోని చెపాక్ స్టేడియంలోనే ఆడాలని కోరుకుంటున్నాను. అది వచ్చే ఏడాదా..? లేక ఐదేళ్ల తర్వాతా..? అనేది తెలియదు' అని ధోని వెల్లడించాడు. అయితే ఆ ఇంటర్వ్యూ ఇచ్చి ఈ సీజన్‌తో సరిగ్గా ఐదేళ్లు అవ్వడం.. ఈ సమయంలోనే ధోని వీడ్కోలు పలుకుతాడనే వార్తలు రావడంతో అభిమానుల్లో ఈ చర్చ మరింత వేడెక్కింది.

ఇదిలా ఉంటే, ధోని అందుబాటులో ఉన్నాడా? సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడా? అనే విషయాన్ని సీఎస్కే యాజమాన్యం ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువ ప్లేయర్లకు అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ధోని ఐపీఎల్ నుంచి పక్కకు తప్పుకున్నాడనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కాగా ప్లే ఆఫ్స్‌కు చేరుకోవాలంటే సీఎస్కేకు ఈ మ్యాచ్ కీలకం.




# 'పెద్ది' ట్రైలర్ విడుదల




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు ముంబయి వేదికగా గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో మెగా జాతర ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ మేకోవర్, ఆయన నటన, డైలాగ్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాను దర్శకుడు బుచ్చిబాబు ఎంత ఎమోషనల్‌గా తెరకెక్కించారో ట్రైలర్ స్పష్టం చేస్తోంది. చరణ్ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదగడం గమనించొచ్చు. ఏఆర్ రెహ్మాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు విజువల్స్ ట్రైలర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. రామ్‌చరణ్ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..." ఈ డైలాగ్ సినిమాలోని చరణ్ క్యారెక్టర్ తీవ్రతను, పోరాటాన్ని తెలియజేస్తోంది. "మాటలతో కాదు.. ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను" అనే డైలాగ్ మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది.

మొత్తంగా 'పెద్ది' ట్రైలర్ సినిమాపై అంచనాలను ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మనసుకు హత్తుకునే ఎమోషన్స్ ఉన్న పక్కా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మెటీరియల్‌లా ఇది కనిపిస్తోంది. జూన్ 4న థియేటర్లలో చరణ్ బాక్సాఫీస్ వేట ఎలా ఉండబోతుందో చూడాలి! వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ రాజ్ కుమార్, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, దివ్యేందు శర్మ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది: కీర్తి సురేశ్ కామెంట్స్



తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్.

'ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

# ఒంటరిగా ఉండేందుకు కూడా సిద్ధమే: సారా అలీ ఖాన్



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'పతి పత్ని ఔర్ వో దో' ఇటీవల మే 15న విడుదలై, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. నేటితరం ప్రేమకథలు, ఆధునిక వైవాహిక బంధాల్లో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను ఈ సినిమాలో ఎంతో ఆసక్తికరంగా చూపించడంతో ప్రేక్షకులకు ఇది బాగా కనెక్ట్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సారా అలీ ఖాన్ పెళ్లి బంధంపై తనకున్న ప్రాక్టికల్ ఆలోచనలను, తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు. తన వ్యక్తిగత జీవితంలో, చుట్టుపక్కల కొన్ని పెళ్లి బంధాలు విఫలమై విడిపోవడాన్ని కళ్లారా చూసిన సారా, వివాహం అనే వ్యవస్థను కేవలం ఊహల్లో చూసి తేలిపోనని స్పష్టం చేశారు. మనం పెరిగిన వాతావరణం, మన చుట్టూ చూసే సంఘటనల నుంచే మన ఆలోచనలు పుడతాయని పేర్కొంటూ, హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఎంతో ఉత్తమమని ఆమె అభిప్రాయపడ్డారు. ఒకవేళ తన జీవితంలోకి సరైన భాగస్వామి దొరకకపోతే, ఎవరికోసం తనను తాను మార్చుకోకుండా జీవితాంతం ఒంటరిగా ఉండటానికైనా సిద్ధమేనని సారా తెగేసి చెప్పారు. నన్ను ఎవరో వచ్చి సంపూర్ణురాలిగా చేయాల్సిన అవసరం లేదని, ఒక సంపూర్ణమైన మనిషిగా సొంతంగా ఎదగడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని సారా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకంటూ ఉన్న ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూ, తన సంతోషాన్ని పంచుకునే వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెబుతూ, ప్రస్తుతానికి మాత్రం తన పూర్తి దృష్టి కేవలం కెరీర్, సొంత ఎదుగుదల, సినిమాలపైనే ఉందని ఆమె క్లారిటీ ఇచ్చారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**